నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, బుధవారం 21 ఆగస్టు 2024 | MAHABUBNAGAR NARAYANPET




అయిజ-కర్నూల్ పెద్దవాగుపై పొంగి ప్రవహిస్తున్న వరద



తిమ్మాజిపేట మండలం గుమ్మకొండ సమీపంలో పీఆర్ఎల్ఐలో భాగంగా తవ్విన ప్రధాన కాల్వలోకి జాలువారుతున్న వర్షపునీరు



మల్దకల్ మండలం చర్లగార్లపాడు పాఠశాలలో నిలిచిన వర్షపు నీటిలోనే వెళ్తున్న విద్యార్థులు



జడ్చర్లలో వెంకటరమణ థియేటర్‌కు వెళ్లే దారిలో డ్రైనేజీ నిండి రోడ్డుపై పారుతున్న వర్షపునీరు



గట్టు మండలంలో వరద నీటిలో సీడ్‌పత్తి మొక్కలు కొట్టుకుపోగా ఇసుక మేట వేసిన పొలం

# కుమ్మేసింది..

- ఉమ్మడి పాలమూరు జిల్లాలో భారీ వర్షం

- నిండిన చెరువులు, పారిన వాగులు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పంట పొలాల్లో నిలిచిన వాననీళ్లు
- పలు ప్రాంతాలకు రాకపోకలు బంద్

- అయిజలో అత్యధికంగా 133.3 మి.మీ. వర్షపాతం
- మండలంలోని పలు విద్యాసంస్థలకు సెలవు

మహబూబ్‌నగర్ నెట్‌వర్క్, ఆగస్టు 20 : ఉపరితల ద్రోణి ప్రభావంతో వర్షాలు దంచికొడుతున్నాయి. మంగళవారం తెల్లవారుజాము నుంచి ఉదయం వరకు జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాలో వివిధ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. పలు చోట్ల వాగులు, వంకలు పారాయి. చెరువులు నిండి అలుగులు పోశాయి. అయిజ-కర్నూల్, అయిజ-ఎమ్మిగనూర్ అంతర్రాష్ట్ర రహదారులతోపాటు ఉత్తనూర్ - సింధనూర్, అయిజ - తూంకుంట, అయిజ - చిన్నతాండ్రపాడు గ్రామీణ రోడ్లపై వాగులు ఉధృతంగా పారడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అయిజ - పులికల్ రోడ్డులోని పోలోని వాగుపై డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోయింది. కర్నూల్ రహదారిలో ఉన్న వంతెనపై నాలుగు అడుగుల మేర ప్రవాహం పారడంతో పోలీసులు రాకపోకలను నిలిపివేయించారు. దీంతో 6 గంటలపాటు ప్రయాణికులకు నిరీక్షణ తప్పలేదు. అయిజలోని లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. పంట పొలాలు నీటి మునిగాయి. కంది, పత్తి, వరి దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందారు. అయిజలో రాష్ట్రంలోనే అత్యధికంగా 133.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. 14 ఏండ్లల్లో ఎప్పుడూ ఇంత వర్షం కురవలేదని అయిజ మండల రైతులు పేర్కొన్నారు. అయిజ పీహెచ్‌సీ ఆవరణ నీటితో చెరువును తలపించింది. దవాఖానకు వచ్చేందుకు రోగులు, సిబ్బంది తీవ్ర ఇక్కట్లు పడ్డారు. మల్దకల్ మండలం చర్లగార్లపాడు ప్రాథమిక పాఠశాల ఆవరణలో నీరు నిలవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు అలాగే వెళ్లారు. అలాగే జడ్చర్ల మండలంలో భారీవర్షం కురిసింది. స్థానిక డ్రైనేజీలు పొంగిపొర్లాయి. రోడ్లపైకి నీరు చేరడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. పాతబజార్, పెద్దగుట్ట, పద్మావతీ కాలనీ, తాలూకా క్లబ్ ప్రాంతంలోని నీళ్లన్నీ నల్లకుంట వద్ద కాల్వలోకి రావడంతో పొంగింది. దీంతో జడ్చర్ల-నాగర్‌కర్నూల్ ప్రధాన రహదారిపైకి చేరడంతో నడుములోతు వరకు ప్రవాహం కొనసాగింది. అలాగే స్థానిక ప్రభుత్వ వంద పడకల దవాఖాన ఆవరణను వర్షపునీరు ముంచెత్తింది. రోగులు ఇబ్బందులు పడ్డారు. అయిజ మండలంలో భారీ వర్షం కురవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో విద్యాసంస్థలకు కలెక్టర్ బీఎల్ సంతోష్ సెలవు ప్రకటించారు.



జడ్చర్లలోని ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపునీటిలో వెళ్తున్న వాహనదారులు



వర్షపునీరు చేరడంతో చెరువును తలపిస్తున్న అయిజ పీహెచ్‌సీ

జడ్చర్ల వంద పడకల దవాఖాన ఆవరణలో నిలిచిన నీళ్లు





అయిజ మండలం సంకాపురం శివారులో పత్తి పంటలో చేరిన వర్షపు నీరు

మక్తల్ మండలంలో నీట మునిగిన కంది పంట



# మాకేదీ రుణమాఫీ?

- గద్వాల డీసీసీబీ పరిధి రైతుల ఆవేదన
- లోన్లు తీసుకున్నది 3,522 మంది..
- 2,081 మందికి మాత్రమే లబ్ధి
- రూ.25.94 కోట్లకుగానూ రూ.13 కోట్లే మంజూరు
- 1,441 మంది ఎదురుచూపులు

గద్వాల, ఆగస్టు 20 : రుణమాఫీ అయిన రైతులు తిరిగి బ్యాంకుల్లో మళ్లీ రుణం తీసుకుంటుంటే రుణమాఫీ వర్తించని రైతులు మాకెందుకు రుణమాఫీ కాలేదు అంటూ బ్యాంకులు ఇటు పీఏసీసీఎస్ కార్యాలయాలు, వ్యవసాయశాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో అర్హులైన బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న వారికి అందరికీ ఎటువంటి షరతులు లేకుండా రుణమాఫీ చేస్తామని చెప్పి ప్రస్తుతం సవా లక్ష నిబంధనలు పెట్టడంతో అర్హత ఉన్నా రుణమాఫీ కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటు రైతులకు రుణమాఫీ రాక ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వక సాగుపై అనాసక్తి చూపుతున్నారు. మళ్లీ ఆసాముల దగ్గర అప్పులు తెచ్చుకొనే పాత రోజులు వచ్చాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు బ్యాంకర్లు రూ.రెండు లక్షలకు పైగా రుణం ఉన్న రైతులు రూ.రెండు లక్షలకు పైగా ఉన్న డబ్బులు బ్యాంకులకు చెలిస్తే రుణమాఫీ చేస్తామని చెప్పడంతో ఆ డబ్బులు బ్యాంకుల్లో కట్టడానికి రైతులు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. గద్వాల డీసీసీబీ పరిధిలో రైతులు తీసుకున్న వివరాలు, రుణమాఫీ తీరు పరిశీలిస్తే ఎంత మందికి ప్రభుత్వం రుణమాఫీ చేసిందో అర్థమవుతుంది.

***గద్వాల డీసీసీబీ పరిధిలో..***

గద్వాల డీసీసీబీ పరిధిలో రూ.లక్ష మొదలు రూ.2 లక్షలకు పైగా రుణాలు తీసుకున్న రైతులు 3,522మంది ఉన్నారు. వీరికి రూ.25.94 కోట్ల రుణమాఫీ కావాల్సి ఉంది. అయితే ప్రస్తుతం రుణమాఫీ అయిన రైతులు 2081మంది ఉండగా వారికి రూ.13కోట్ల మేర రుణమాఫీ జరిగింది. ఇంకా రుణమాఫీ జరగాల్సిన రైతులు 1,441 మంది ఉన్నారు. అయితే వీరికి వివిధ కారణాలు చూపుతూ మాఫీ చేయలేదు. మేము రుణమాఫీకి అర్హత ఉన్నా ఎందుకు మాకు రుణమాఫీ కాలేదని బ్యాంకులు, పీఏసీసీఎస్, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ రైతులు తిరుగుతున్నా అధికారులనుంచి వారికి సరైనా సమాధానం రాకపోవడంతో రైతులకు ఏమి చేయాలో పాలుపోని పరిస్థితి ఏర్పడింది. కాంగ్రెస్ నాయకులు ఎన్నికలప్పుడు ఒక మాట గెలిచినప్పుడు మరో మాట చెప్పడంతో ప్రభుత్వం, ముఖ్యమంత్రి తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎటువంటి నిబంధనలు లేకుండా రుణాలు తీసుకున్న రైతులందరికీ మాఫీ వర్తింపజేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## షరతులను ఎత్తివేయాలి..



ధరూర్ పీఏసీసీఎస్‌లో రూ.రెండున్నర లక్షల రుణం తీసుకున్నాను. అయితే ప్రభుత్వం ఎటువంటి షరతులు లేకుండా రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పుడు రూ.రెండు లక్షల పైనా ఉన్న నగదు చెల్లిస్తేనే రుణమాఫీ చేస్తామని చెబుతున్నారు. ప్రస్తుతం పంటల పెట్టుబడికి పైసలు లేని సమయంలో బ్యాంకులు రూ.రెండు లక్షలపైగా ఉన్న నగదు చెల్లించాలంటే మళ్లీ ఆసాముల దగ్గరకు అప్పు తెచ్చుకోవాల్సిన పరిస్థితి. ప్రస్తుతం రెండు లక్షలు రుణమాఫీ చేస్తే తిరిగి లోన్ తీసుకున్న తర్వాత మిగతా డబ్బులు చెల్లిస్తామన్నా అధికారులు ఒప్పుకోవడం లేదు. మా పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా తయారైంది. *- జేడీ సత్యన్న, రైతు, ధరూర్*

## మాట మార్చిన సీఎం..



గద్వాల ఎస్‌బీఐలో రూ.1.70 లక్షల రుణం తీసుకున్నాను. నాకు మూడు విడుతల్లో రుణమాఫీ కాలేదు. వ్యవసాయశాఖ అధికారుల దగ్గరకు వెళ్తే కుటుంబ నిర్ధారణ చేయాల్సి ఉందని చెబుతున్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో రూ.రెండు లక్షలు రుణం తీసుకున్న ప్రతి రైతుకు ఎటువంటి షరతులు, నిబంధనలు లేకుండా రుణమాఫీ చేస్తామని చెప్పారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం మాట మారుస్తున్నాడు. వీరు చెప్పింది ఒకటి ప్రస్తుతం చేస్తున్నది ఒకటి. ఏది ఏమైనా రూ.రెండు లక్షలు తీసుకున్న ప్రతి రైతుకు ఎటువంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి. *- పీ సత్యన్న, రైతు, కొత్తపాలెం, ధరూర్ మండలం*

## నాకైతే నమ్మకం లేదు..



ఎన్నికలకు ముందు ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేస్తామని కాంగ్రెసోళ్లు ప్రకటించారు. వారిని నమ్మి ఓట్లేసిన వారికి తగిన బుద్ధి చెప్పారు. ఇప్పుడేమో రేషన్‌కార్డు అంటూ.., పేర్లు మ్యాచ్ కావడం లేదంటూ రుణమాఫీకి ఎన్నో కొర్రీలు పెడుతున్నారు. నాకు రూ.2 లక్షల వ్యవసాయ రుణం ఉన్నది. ఒక్క పైసా కూడా మాఫీ కాలేదు. అధికారులను అడిగితే తికమక సమాధానం చెబుతున్నారు. మళ్లీ మళ్లీ తిప్పించుకుంటున్నారు. ఇక మాఫీ అయితదన్న నమ్మకం నాకైతే లేదు. *- బాకారం రమేశ్, రైతు, కుప్పగండ్ల, వెల్దండ మండలం*

## చెప్పిందొక్కటీ చేయలేదు..



ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నేతలు చెప్పింది ఒక్కటి కూడా చేయలేదు. రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటున్నారు.. కానీ వాళ్లు చేసిందైతే శూన్యం. ఒక్క ఊరిలో కూడా అందరికీ రుణమాఫీ అయినట్లు కనిపించడం లేదు. నేను రూ.75 వేలు రుణం తీసుకుంటే వడ్డీతో కలిపి రూ.లక్ష దాటింది. ఒక్క రూపాయి కూడా మాఫీ కాలేదు. కేసీఆర్ ప్రభుత్వమే బాగుండే. *- జల్లెల తిరుపతయ్య, రైతు, కుప్పగండ్ల, వెల్దండ మండలం*

## సమాధానం చెప్తలేరు..



వనపర్తి యూనియన్ బ్యాంకులో నా భార్యపై రూ.1.20 లక్షలు తీసుకుంటే.. నా పేరుమీద రూ.1.40 లక్షల రుణం తీసుకున్నాం. ఇద్దరిపై వేర్వేరుగా మూడెకరాల పొలం ఉన్నది. బ్యాంకులో ఇద్దరి అప్పు కలిపితే రూ.2.60 లక్షలు అవుతుంది. ఈ లెక్కన మాకు రుణమాఫీ వర్తించాలి. నిరుపేద గిరిజన కుటుంబమైన తాము మాఫీ అవుతుందని ఎదురుచూశాం. తీరా మూడో విడుత రుణమాఫీలో పేర్లు రాలేదు. ఎందుకు కాలేదని బ్యాంకోళ్లను అడిగితే సరైన సమాధానం రావడంలేదు. మేమేం పాపం చేశాం. *- ఇస్లావత్ రూప్లానాయక్. పెద్దగూడెం తండా, వనపర్తి మండలం*



కల్వకుర్తి ఏడీఏ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న రైతు జేఏసీ నాయకులు

# మాఫీపై రైతన్న మండిపాటు

- ఏడీఏ కార్యాలయం ఎదుట ఆందోళన
- అర్హులకు మాఫీ చేయాలని డిమాండ్

కల్వకుర్తి, ఆగస్టు 20 : కల్వకుర్తి వ్యవసాయ సహాయ సంచాలకులు కార్యాలయం ఎదుట మంగళవారం రైతు జేఏసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. మూడు విడుతల పేరుతో కొర్రీలుపెడుతూ కేవలం 40 శాతం మంది రైతులకు మాత్రమే ప్రభుత్వం మాఫీ చేసిందన్నారు. రేషన్ కార్డు ప్రాతిపదికన రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించినా నేడు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. మాఫీని పరిశీలిస్తే ప్రభుత్వం జీవో ఇచ్చిన విధంగానే జరిగిందని, సీఎం, మంత్రులు మాత్రం సాంకేతిక కారణాలంటూ మాయమాటలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు ఇవ్వకుండా, మాఫీ ముందేసుకుని, అది కూడా సంపూర్ణంగా అందించకుండా కర్షకులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని కన్నెర్ర చేశారు. రైతుబంధుకు ఎగనామం పెట్టిన కాంగ్రెస్‌కు నూకలు చెల్లే రోజుల దగ్గర పడ్డామని హెచ్చరించారు. రైతుల ఉసురు పోసుకోవద్దని, వారు బాధపెడితే మట్టికొట్టుకుపోతారని శాపనార్థాలు పెట్టారు. అనంతరం ఏడీఏ కార్యాలయంలో వినతిప్రతం అందజేశారు. కార్యక్రమంలో రైతు జేఏసీ నాయకులు బండెల రాంచంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీకృష్ణ, శేఖర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, నర్సింహారెడ్డి, రాంరెడ్డితోపాటు రైతులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో శాంతిర్యాలీ నిర్వహిస్తున్న వైద్యవిద్యార్థులు

# మెడికోల కొవ్వొత్తుల ర్యాలీ

నాగర్‌కర్నూల్, ఆగస్టు 20 : కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనను నిరసిస్తూ వైద్య విద్యార్థులు, వైద్యులు రోజుకో రీతిలో నిరసనలు చేపడుతున్నారు. మంగళవారం ప్రభుత్వ మెడికల్ విద్యార్థులు తరగతులను బహిష్కరించి కళాశాల ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. సాయంత్రం కొవ్వొత్తులతో ప్రధాన రహదారి మీదుగా శాంతి ర్యాలీ నిర్వహించారు. బాధితురాలికి న్యాయం చేయాలంటూ ఆందోళనలు చేపట్టారు. నిందితులను ఉరితీసేంత వరకు తమ నిరసనలు కొనసాగుతాయని హెచ్చరించారు. వైద్యులు, వైద్య విద్యార్థులు, మహిళలు, చిన్నారులకు భద్రత లేకుండాపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమాల్లో మెడికల్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాకు వర్తించదా?

- అధికారులను నిలదీసిన రైతులు
- పొంతనలేని సమాధానాలతో దాటవేత

మానవపాడు, ఆగస్టు 20 : 'రేవంత్ సర్కారు అమలు చేసిన పంట రుణమాఫీ మాకు వర్తించదా..? బీఆర్ఎస్ హయాంలో రూ.లక్ష వరకు ప్రతి రైతు తీసుకున్న క్రాప్‌లోన్లు మాఫీ అయ్యాయి.. ఇప్పుడెందుకు జరగడం లేదు'.. అని అధికారులను రైతులు నిలదీశారు. మంగళవారం మానవపాడు రైతువేదికలో నిర్వహించిన సమావేశానికి ఏడీఏ సక్రియానాయక్, ఏఈవో సుబ్బారెడ్డి హాజరయ్యారు. అధికారులు వస్తున్నారన్న విషయం తెలుసుకొన్న రుణమాఫీ కాని రైతులు భారీగా అక్కడకు చేరుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించి.. మూడు విడుతల్లో నేడు కొర్రీలు పెడుతూ అందరికీ అందించడం లేదని ధ్వజమెత్తారు. రూ.20 వేల నుంచి రూ.2 లక్షల రుణం ఉన్న రైతులు చాలా మందిరిక మాఫీ కాలేదని వాపోయారు. దీంతో రైతులు బ్యాంకులు, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అసలు మాఫీ అవుతుదా..? అని ప్రశ్నించారు. దీనికి అధికారులు మాత్రం తెలియదని, మాఫీ కాని రైతుల వివరాలు సేకరిస్తున్నట్లు చెప్పి చేతులు దులుపుకొన్నారు.



మానవపాడు రైతువేదికలో అధికారులను నిలదీస్తున్న రైతులు